అసంపూర్తిగా మోడ్రన్ ధోబీ ఘాట్

- గత ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లు మంజూరు
- పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న రజక వృత్తిదారులు



చిట్యాలలో స్లాబ్ వరకు నిర్మించిన మోడ్రన్ ధోబీ ఘాట్

చిట్యాల: రజక కుల వృత్తిదారుల ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన మోడ్రన్ ధోబీ ఘాట్‌ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ధోబీ ఘాట్ పనులు స్లాబ్ వరకు మాత్రమే పూర్తయ్యాయి. నిధుల విడుదల జాప్యంతో ధోబీ ఘాట్ నిర్మాణం ఇరవై నెలలుగా అసంపూర్తిగా నిలిచిపోయింది.

పద్దెనమిది గదుల్లో నిర్మించేలా ప్రణాళిక

చిట్యాల మున్సిపాలిటీలో సుమారు వందలకుపైగా రజక వృత్తిదారుల కుటుంబాలు ఉన్నాయి. వీరంతా కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి గతంలో చిట్యాల మున్సిపాలిటీలోని శివనేనిగూడెంకు వెళ్లే పాత రోడ్డులో పద్దెనిమిది ధోబి ఘాట్‌లు ఉండేవి. వీటిలో బట్టలు ఉతకడానికి శుభ్రం చేయడానికి తగిన నీటి వసతి లేకపోవడంతో వృత్తిదారులకు ఇబ్బందిగా ఉండేది. దీంతో గత ప్రభుత్వం మోడ్రన్ ధోబీ ఘాట్ నిర్మాణానికిగాను టీయూఎఫ్ఐడీసీ(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ద్వారా రూ.రెండు కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులతో పద్దెనిమిది గదుల్లో అవసరమైన నీటి వసతితోపాటుగా మోడ్రన్ డ్రై క్లీనర్స్ ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు.

స్లాబ్ వరకు పూర్తి

2023 ఆగస్టు 16వ తేదీన అప్పుడు నకిరేకల్ ఎమ్మెల్యేగా ఉన్న చిరుమర్తి లింగయ్య మోడ్రన్ ధోబీ ఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ధోబీఘాట్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించి స్లాబ్ వరకు పూర్తి చేశారు. దీనికిగాను సుమారు రూ.నలభై లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఆ తరువాత నిధుల మంజూరు కాకపోవడంతో మిగిలిన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ చేపట్టకపోవడంతో ధోబీఘాట్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అనంతరం ప్రభుత్వం మారిపోవడం, మోడ్రన్ ధోబీ ఘాట్‌ల నిర్మాణాలపై ప్రభుత్వం ఎలాంటి సమీక్షలు చేయకపోవడంతోపాటు నిధులు మంజూరు చేయలేదు. దీంతో ధోబీఘాట్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో కుల వృత్తిదారులకు ఇబ్బందిగా మారింది. అసంపూర్తిగా ఉన్న ధోబీ ఘాట్‌లకు అవసరమైన నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని పలువురు రజక కుల వృత్తిదారులు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



చిట్యాలలో మోడ్రన్ ధోబీ ఘాట్ నిర్మాణ పనులు ఇరవై నెలలుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ ధోబీ ఘాట్ నిర్మాణం పూర్తయితే రజక కుల వృత్తిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ధోబీ ఘాట్ నిర్మాణాలకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలి. ఇందుకు అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సహకరించాలి.

– దామనూరి సైదులు, రజక సంఘం నాయకుడు, చిట్యాల

మిగిలిన పనులకు నిధులు మంజూరు కాలేదు

చిట్యాలలో మోడ్రన్ ధోబీ ఘాట్ నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలను గత ప్రభుత్వం కేటాయించింది. దీనిలో భాగంగా నలభై లక్షల రూపాయలు మంజూరు కావడంతో స్లాబ్ వరకు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ పూర్తి చేశారు. అనంతరం మిగిలిన పనులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధుల మంజూరు కాగానే ధోబీ ఘాట్ నిర్మాణాలను పూర్తి చేయిస్తాం.

– గౌతం రాజు, ఏఈ చిట్యాల మున్సిపాలిటీ

క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ టూటౌన్ : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టూటౌన్ : ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాలకు నల్లగొండలో ఈ నెల 23న జరగనున్న జిల్లాస్థాయి క్రీడా పోటీల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచినట్లయితే ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు పొందాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ డీఓ అక్బర్ అలీ, పీఈటీ కుంభం నర్సిరెడ్డి, సూపరింటెండెంట్ నజీర్ పాల్గొన్నారు.

నేడు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

మర్రిగూడ : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మండల స్థాయిలో బాలబాలికలకు ఈ నెల 19న ఉదయం 9 గంటల నుంచి మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక జరుగుతుందన్నారు. 1-9-2016 నుంచి 31-8-2017 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బోన ఫైడ్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, 8 పాస్ ఫొటోలు, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్‌లు, ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు డివిజన్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సౌజన్య 9948118825 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీటీ రోడ్ల నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యత పరిశీలిస్తున్న ఎస్‌ఈ

మునుగోడు: గ్రామీణ ప్రాంతాల రోడ్లను కొందరు కబ్జా చేస్తున్నారని, ప్రతి రోడ్డు 33 అడుగుల విస్తీర్ణంతో ఉండేలా పర్యవేక్షించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ ఆర్.రామచంద్రారెడ్డి సూచించారు. బుధవారం మునుగోడు మండలంలోని గంగోరిగూడెం, నేరటోనిగూడెం గ్రామాల్లో బీటీ రోడ్ల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా ప్రతిరోజు 5.5 మీటర్ల బీటీ వేసి రోడ్డుకు ఇరువైపులా కనీసం 3 మీటర్ల మట్టి చదును చేయించాలన్నారు. చెరువులు, కుంటల సమీపంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆయన వెంట డీఈ నాగేశ్వర రావు, ఏఈ సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



మునుగోడు : చొల్లేడులో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి కట్టిస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని చొల్లేడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో పదేళ్లపాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ఏ ఒక్కరికి కూడా ఇల్లు కట్టించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి మొదటి దఫాలో నియోజకవర్గంలో 3500 మంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పంచాయతీ కార్యదర్శి పుష్ప, మాజీ సర్పంచ్ జనిగల మహేశ్వరి, మాజీ ఎంపీటీసీ వనం నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

కనగల్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కురంపల్లి మాజీ సర్పంచ్ ఓర్సు పెంటయ్య అన్నారు. బుధవారం కురంపల్లి గ్రామంలో 45 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఏఈ వెంకటేశ్వర్లు, బొమ్మకంటి నరసింహస్వామి , బుషిగంపల రామస్వామి, సోమ కృష్ణయ్య, తలారి సాయన్న, తలారి ఈశ్వరయ్య, తలారి నాగార్జున, బోనగిరి దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

తిప్పర్తి : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని మాజీ ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు అన్నారు. ఇండ్లూరు గ్రామంలో 58 ఇళ్లు మంజూరు కావడంతో బుధవారం వారికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి సహకారంతో అదనంగా మరో 50 ఇళ్లు మంజూరు చేయించి ప్రతి నిరుపేద పక్కా ఇల్లు నిర్మించుకునేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కట్టంగూర్ : మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న గ్రామీణ రోడ్లకు మరమ్మతులకు చేపట్టాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు బత్తిని నాగరాజుగౌడ్ మాట్లాడుతూ మండలంలోని ఎరసానిగూడెం, పరడ, తూర్పుబాయిగూడెం, కురుమర్తి, తొట్లవారిగూడెం, చెర్వుఅన్నారం, అక్కలాయిగూడెం గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. చెర్వుఅన్నారం క్రాస్ రోడ్డు వద్ద రాత్రి సమయంలో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఆ ప్రాంతంలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కట్టంగూర్ నుంచి బస్టాండ్ వరకు సర్వీసు రోడ్డు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి గున్నాల నాగరాజు, బసవోజు వినోద్, చొక్కాల చరణ్, నాగరాజు, గోపి పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులు అందజేస్తున్న నర్సిరెడ్డి

కనగల్ : నల్లగొండ లయన్స్ క్లబ్ రాయల్ సహకారంతో బుధవారం కనగల్ మండల పరిధిలోని రామచంద్రపురం ప్రాథమిక పాఠశాలలోని 22 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రాయల్ అధ్యక్షుడు ఎర్రబెల్లి నర్సిరెడ్డి, సెక్రటరీ కొప్పుల సుధాకర్‌రెడ్డి, ట్రెజరర్ నన్నూరు మురళీమోహన్‌రెడ్డి, సభ్యులు కోయ మధుసూదన్‌రెడ్డి, కేసాని వెంకటరెడ్డి, ఏమిరెడ్డి దిలీప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, చంద్రమ్మ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనివర్సల్ లెర్నర్ రిసోర్స్ ఫౌండేషన్ చైర్మన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉదావత్ లచ్చిరాం బుధవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.మంజులత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహం తనిఖీ

మర్రిగూడ : ఎస్సీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించడమే తమ లక్ష్యమని దేవరకొండ డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓ కరుణశ్రీ అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతోపాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం వార్డెన్ వరికుప్పల రాజుకు పలు సూచనలు చేశారు.

ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శాలిగౌరారం: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్నవెంకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకుడు చలకాని మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సిరుపంగి ఆంజనేయులు, కార్యదర్శి మక్క బుచ్చిరాములు, నాయకులు డెంకెల లింగయ్య, కల్లూరి లింగయ్య, గుండ్లపల్లి వెంకన్న, అంకర్ల కొమరయ్య, బట్ట అవనీజ తదితరులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలి

నకిరేకల్ : ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ కోరారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్, సమీర్, రాజు, ఉమేష్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

మునుగోడు : పంటల పెట్టుబడి కోసం ప్రభుత్వం అందించిన రైతు భరోసాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ కోరారు. బుధవారం పులిపలుపుల గ్రామ రైతువేదికలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు పెట్టుబడి ఇబ్బంది కావొద్దని ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మాదగోని నర్సింహ, గ్రామంలోని రైతులు దంతం లింగారెడ్డి, యాదయ్య, లింగస్వామి, మదార్‌సాబ్, యాదమ్మ, స్వామి, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



చండూరు : బంగారిగడ్డలో ఎమ్మెల్యేకు తమ సమస్యను వివరిస్తున్న ఓ మహిళ



రోడ్డు విస్తరణలో తొలగించనున్న ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డలో కనగల్–మాల్ డబుల్ రోడ్డు పనుల్లో ఇళ్లు కోల్పోతున్న బాధితులు మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. దీంతో ఎమ్మెల్యే బుధవారం బంగారిగడ్డ గ్రామాన్ని సందర్శించి ఇళ్లు కోల్పోతున్న వారితో మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతూ ఎంతమేర కోల్పోతున్నారో పరిశీలించారు. పేదోళ్లకు అన్యాయం చేసి అభివృద్ధి పనులు చేయమని, న్యాయం చేసుకుంటూనే అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ పరిధిలో డ్రెయినేజీ నిర్మాణంలోపాటు 66 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.

రోడ్డు విస్తరణలో నాణ్యత పాటించాలి

మర్రిగూడ: రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామంలో రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. చౌరస్తా వద్ద ప్రత్యేక నిర్మాణం చేపట్టాలని, తానే స్వయంగా డిజైన్ గీసి అధికారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ లెంకలపల్లి నుంచి చండూరు మండలం వరకు ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బనబోయిన రామకృష్ణయాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, పాక నగేష్‌యాదవ్, ఏర్పుల శ్రీశైలం, నందికొండ లింగారెడ్డి పాల్గొన్నారు.

గట్టుప్పల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

గట్టుప్పల్ : తన పదవీ త్యాగంతో ఏర్పడిన గట్టుప్పల్ మండల కేంద్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంతోపాటు తేరట్‌పల్లి గ్రామంలో స్థానిక నాయకులతోపాటు కలియదిరిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారాయణపురం మండల కేంద్రం నుంచి గట్టుప్పల్ మండల కేంద్రం వరకు రోడ్డు విస్తరణ పనులు, గట్టుప్పల్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, దండు యాదగిరిరెడ్డి, కంచుకంట్ల సంపత్, సుభాష్, వీరమళ్ల శ్రీశైలం, రావుల రమేష్, వెంకటరమణారెడ్డి, నామని బుచ్చయ్య, భీమగాని మల్లేశం, చెరుపల్లి ఆంజనేయులు, మాదగాని ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మునుగోడు: మునుగోడులో దళిత కుటుంబాలకు శ్మశానవాటికతోపాటు స్నానాల గదుల నిర్మించాలని కోరుతూ పలువురు దళితులు బుధవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ట్యాంకర్లతో నీటిని కొని తెచ్చుకుని రోడ్డుపై స్నానాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు.

చెట్ల కింద వైద్యం ఇంకా ఎన్నాళ్లో !



మునుగోడులో చెట్ల కింద వైద్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎంలు

మునుగోడు: ప్రభుత్వాలు మారినా మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. పేరుకు నియోజకవర్గ కేంద్రమైనా పెద్ద ఆస్పత్రి లేదు. ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరైన భవనం లేదు. ఏడు గదులతో ఉన్న ఈ ఆస్పత్రిలో వైద్యులు, మందుల నిల్వతోపాటు ల్యాబ్ టెక్నీషియన్‌కు, రోగులకు ఒక్కో గది చొప్పున కేటాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు మునుగోడులో ఆరోగ్య ఉప కేంద్రం ఉండగా దానికి పక్కా భవనం లేదు. దీంతో ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది ఆస్పత్రి ఆవరణలోని చెట్ల కింద ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రతి బుధవారం ఐదేళ్ల చిన్నారులకు టీకాలు వేయాల్సి ఉండగా ఆ చెట్ల కిందే టీకాలు వేసి పంపిస్తున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మునుగోడు ఉప కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలని కోరుతున్నారు.

శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి మాస కల్యాణం



మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు కృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు వేద మంత్రాలతో మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ దోసపాటి ప్రసాద్, సామ కొండల్‌రెడ్డి, ఐతరాజు రమేష్, కొప్పు నర్సింహ, పసునూరి శ్రీనివాస్, ఇరుకుల భిక్షపతి, దోసపాటి విష్ణుమూర్తి, శివ, బిల్లకంటి శ్రీకాంత్, రంగ కృష్ణయ్య, వెంకన్న, వేణు, విజయలక్ష్మి, పాశం పూలమ్మ, కొప్పు భాగ్యమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ యోగాకు సమయం కేటాయించాలి



యోగా చేస్తున్న ఎస్ఎల్‌బీసీ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు

నల్లగొండ టౌన్ : ప్రతిరోజూ గంటసేపు యోగాకు సమయం కేటాయించాలని ఆయుష్ డిపార్టుమెంట్ హోమియో డాక్టర్ తయ్యాబా కౌసర్ అన్నారు. బుధవారం నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యానికి యోగ ఉపయోగపడుతుందన్నారు. ఆహార నియమాలు, వ్యాయామం ద్వారా రోగాల నుంచి దూరంగా ఉండవచ్చని సూచించారు. యోగా గురూజీలు కె.భజరంగ్ ప్రసాద్, సింగం ప్రవీణ్, వైష్ణవి, కోమల యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ వేణుగోపాల్, టీచర్లు కృష్ణ సంజయ్, వరలక్ష్మి, జ్యోతి, పద్మ,నిశాత్, స్టాఫ్ నర్స్ రాము పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

నకిరేకల్ : దేశంలో 11 ఏళ్ల మోదీ పాలనలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు కోరారు. నకిరేకల్‌లో బుధవారం జరిగిన బీజేపీ మండలస్థాయి సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, కొండేటి శ్రీను, పసునూరి సైదులు, చనగాని రాములు, ఉప్పల నాగరాజు, బండమీది శ్రీకాంత్, దొడ్డోని శంకర్, పెద్దులు, యాదయ్య, పోలిశెట్టి నాగరాజు, విక్రంరెడ్డి, సురేష్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ శంకర్‌రెడ్డి

శాలిగౌరారం: ఇటీవల ట్రాక్టర్ కిందపడి మృతిచెందిన చిత్తలూరు గ్రామానికి చెందిన గిరగాని నరేశ్ కుటుంబానికి మండలంలోని తుడిమిడి గ్రామానికి చెందిన సాండ్‌ట్యాక్స్ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.85 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, ట్రాక్టర్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల గదులు సీజ్



సీజ్ చేసిన గది ఎదుట ఎంఈఓ నాగయ్య

నకిరేకల్ : పట్టణంలోని నారాయణ, శ్రీ చైతన్య పాఠశాలలను బుధవారం నకిరేకల్ ఎంఈఓ మేకల నాగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న గదులను సీజ్ చేశారు. ఆయన వెంట వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అల్లి అంజన్‌యాదవ్, జిల్లా సంపత్, ఏకుల గణేశ్, శ్రవణ్, భరత్ శివ, ప్రవీణ్ ఉన్నారు.

క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలి

నల్లగొండ టౌన్ : బెస్టు అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేసి కొత్తగా అడ్మిషన్లు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్రం నాయక్‌లు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుంటే 21న కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేయనున్నామన్నారు.

విద్యార్థినికి చేయూత



నగదు అందజేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించిన నల్లగొండ ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థిని బచ్చు ప్రియాంకకు డీఎస్ఆర్ (సత్యం) ఫౌండేషన్ చైర్మన్, కళాశాల జోనల్ ఇన్‌చార్జ్ దోనాల శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ కె.శివరాంరెడ్డితో కలిసి బుధవారం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సైదాబాబు, సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మనోజ్ రెడ్డి, డీన్ కిశోర్‌బాబు, ఏఓ సరితారెడ్డి, వర్ధన్, ప్రసన్నకుమార్, శ్రీనివాస్, శోభ పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ఎన్నిక



నూతన పాలకవర్గ సభ్యులు

నల్లగొండ: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో బుధవారం కాలనీ సంక్షేమ సంఘం పాలక వర్గం ఎన్నికలు (2025–28)నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా డా.అక్కెనపల్లి మీనయ్య, అధ్యక్షుడిగా ఝెడ్ల సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాసులు, కార్యదర్శిగా నిమ్మల పిచ్చయ్య, కోశాధికారిగా రేకల కృష్ణయ్య, ఉప కార్యదర్శిగా కొత్తపల్లి శ్రీమన్నారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బండారు రామలింగం, వరకాంతం రాజేష్‌రెడ్డి, జైని కిరణ్‌కుమార్, సోమారపు రాములు, పత్తి భద్రయ్య, రామస్వాములు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అక్కెనపల్లి విద్యాసాగర్ తెలిపారు.

స్మారక స్తూపం ఆవిష్కరణ

చిట్యాల: చిన్నకాపర్తి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఈరమళ్ల చంద్రయ్య స్మారక స్తూపాన్ని బుధవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐతరాజు నర్సింహ, కత్తుల లింగస్వామి, కోనేటి రాములు, రుద్రారపు పార్వతమ్మ, వీరమళ్ళ వెంకటేశం, రూపని ఇద్దయ్య, హన్మయ్య, రుద్రారపు భిక్షం , విష్ణుమూర్తి, దేశపాక సైదులు పాల్గొన్నారు.

భవిత భవనం పరిశీలన

తిప్పర్తి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవిత కేంద్రం నూతన భవనం పనులు త్వరగా పూర్తి చేయాలని తిప్పర్తి తహసీల్దార్ పరుశురాం అన్నారు. బుధవారం భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం సొంత భవనాన్ని నిర్మిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు బద్దం సుధీర్, మాజీ ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యల ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్

మర్రిగూడ: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1916 ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య బుధవారం తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను మిషన్ భగీరథ సిబ్బంది స్వీకరించి సమస్య పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తారని అన్నారు.

ఎంపీడీఓకు వినతి

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి–ఆరెగూడెం గ్రామ పంచాయతీలను కలుపుతూ ఉన్న ఎంపీటీసీ స్థానానికి అదనంగా మరో ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామాలకు చెందిన నాయకులు బుధవారం చిట్యాలలో ఎంపీడీఓ జయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో కలిపి ఏడు వేలకుపైగా జనాభా ఉందని, నాలుగు వేల నాలుగు వందలకుపైగా ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. గ్రామ పరిపాలన వికేంద్రీకరణ, అభివృద్ధికిగాను రెండో ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీఓను కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, లింగారెడ్డి, జానయ్య, ఆవుల సుందర్, నాగరాజు ఉన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

నార్కట్‌పల్లి : విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ అధికారులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎడ్ల మహాలింగం, మైపాల్‌రెడ్డి, భాస్కర్, విజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు ఉన్నారు.